భారతదేశం.. జనాభా పెరుగుదల!

ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ జన సంఖ్యలో రెండోస్థానంలో ఉంది. స్వాతంత్ర్యానంతరం పెరుగుతున్న దేశ జనాభా విధాన నిర్ణేతలకు పెద్ద సమస్యగా పరిణమించింది. దాంతో జనాభా పెరుగుదల ఆర్థిక, సాంఘిక ప్రగతికి అవరోధంగా మారుతుందని భావించి... దాన్ని అరికట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. అందులో భాగంగా 1952లో కుటుంబ సంక్షేమ పథకాలను ప్రోత్సహించాలని నిర్ణయించి జనాభా విధానాన్ని ప్రకటించారు. అప్పటినుంచి జనాభా నియంత్రణ లేదా స్థిరీకరణ.. దేశ ఆర్థిక, సామాజిక అభివృద్ధి అజెండాలో అంతర్భాగంగా ఉంది!

స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో.. దేశ జనాభా 345 మిలియన్లు . కాగా 2001 లెక్కల ప్రకారం.. 1029 మిలియన్లకు పెరిగింది. జూలై 1, 2007 నాటికి భారత జనాభా 1134 మిలియన్లకు చేరుకుందని అంచనా. అంటే.. 1947 తర్వాత దాదాపు 789 మిలియన్ల మంది పెరిగారు. దీనిని బట్టి దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలో జనాభా పెరుగుదల చాలా వేగవంతమైందని చెప్పవచ్చు. ఏటా 2 శాతం చొప్పున జనాభా వృద్ధి రేటు... 35 సంవత్సరాల్లో జన సంఖ్యను రెట్టింపు చేస్తుంది. ఈ స్థితి మన దేశంలో సంభవించింది. 1951లో మనదేశ జనాభా 361 మిలియన్ల నుంచి... 1986లో 763 మిలియన్లకు పెరిగింది. 1951 నుంచి 1961 మధ్యకాలంలో.. అదనంగా పెరిగిన జనాభా 78 మిలియన్లు అయితే.. 1991 నుంచి 2001 మధ్యకాలంలో... జనాభా వృద్ధిరేటులో కొద్దిపాటి తగ్గుదల సంభవించినప్పటికీ.. 183 మిలియన్ల మంది అదనంగా వచ్చి చేరారు.

2035-40 నాటికి మనదేశం జనాభాలో చైనాను అధిగమిస్తుందని అంచనా. స్వాతంత్ర్యానంతరం 4 రాష్ట్రాల్లో జనాభా వృద్ధి ఎక్కువగా ఉంది. ఇవి బీహార్ (జార్ఖండ్‌తో కలిపి), మధ్యప్రదేశ్ (ఛత్తీస్‌గఢ్‌తో కలిపి), రాజస్థాన్, ఉత్తరప్రదేశ్(ఉత్తరాఖండ్‌తోకలిపి). 2001 గణాంకాల ప్రకారం... దేశం మొత్తం జనాభాలో ఇవి 41 శాతం కల్గి ఉన్నాయి. ఈ నాలుగు రాష్ట్రాల్లో... మధ్యప్రదేశ్ (ఛత్తీస్‌గఢ్ కలిపి)లో మాత్రమే 1991-2001 మధ్య సగటు సాంవత్సరిక జనాభా వృద్ధి తగ్గింది. ఈ కాలంలో బీహార్ (జార్ఖండ్ కలిపి)లో జనాభా పెరగగా... రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ (ఉత్తరాఖండ్‌తో కలిపి)లో జనాభా పెరుగుదలలో మార్పులేదు.



పర్యావరణానికి సవాలుగా:

గత 60 ఏళ్లుగా జనాభా పెరుగుదల.. ఆర్థిక వృద్ధి, ప్రజల జీవన నాణ్యతపై ప్రభావం చూపింది. ఇది సాంఘిక, ఆర్థిక, పర్యావరణ సుస్థిరతకు సవాలుగా మారింది. 1950-51 నుంచి 2005-06 మధ్యకాలంలో.. దేశ స్థూల జాతీయోత్పత్తి స్థిర ధరల వద్ద (1999-2000) 12 రెట్లు పెరిగింది. 1950-51లో స్థూల జాతీ యోత్పత్తి రూ.2179 బిలియన్లు. కాగా 2005-06లో రూ. 25,807 బిలియన్లకు పెరిగింది. అయితే, తలసరి స్థూల జాతీయోత్పత్తిలో పెరుగుదల 3.57 రెట్లు మాత్రమే పెరగడం... జనాభా వృద్ధిరేటు ఎక్కువగా ఉండడాన్ని సూచిస్తుంది.

1950-51లో తలసరి స్థూల జాతీయోత్పత్తి రూ. 5,799. కాగా 2005-06లో రూ.20,734. స్థూల జాతీయోత్పత్తి(GNP)లో ఎక్కువ భాగాన్ని పెరుగుతున్న జనాభాకు అవసరమైన కనీస సౌకర్యాలపై వ్యయం చేయడం వల్ల... ప్రజల జీవన నాణ్యత ఆశించినంతగా మెరుగుపడలేదు. జనాభా పెరుగుదల ప్రభావం పర్యావరణ సుస్థిరత పై కూడా కనిపించింది. 1990 నుంచి 2002 మధ్యకాలంలో.. మొత్తం శక్తి వినియోగం.. 366 మిలియన్ టన్నుల నుంచి 538 మిలియన్ టన్నులకు పెరిగింది. ఇదేకాలంలో వాతావరణంలోకి కార్బన్ డయాక్సైడ్ విడుదల 680 మిలియన్ టన్నుల నుంచి 1118 మిలియన్ టన్నులకు పెరిగింది. 1990 నుంచి దేశంలో శక్తి తలసరి వినియోగం పెరగడానికి అధిక జనాభానే కారణం. అధిక జనాభా... ఇంధన వినియోగంలో 56 శాతం కంటే ఎక్కువ పెరుగుదలకు... కార్బన్‌డయాక్సైడ్ విడుదల 36 శాతం మేర పెరగడానికి దారితీసింది. ఇది పర్యావరణంపై ఒత్తిడి పెంచింది.

జనాభా-ఆర్థికాభివృద్ధి:

దేశంలో లభ్యమయ్యే భౌతిక వనరులను శ్రామికశక్తి సహాయంతో వినియోగించుకోవడం వల్ల ఉత్పాదక ప్రక్రియ వేగవంతమవుతుంది. తద్వారా దేశంలో ఆర్థికాభివృద్ధి చోటుచేసుకుంటుంది. ఈ అభివృద్ధి ప్రయత్నంలో... శ్రామికశక్తి నుంచి ధనాత్మక వాటా లభించినప్పటికీ.. వేగంగా పెరుగుతున్న జనాభా... అభివృద్ధి ప్రక్రియను ఆటంకపరుస్తుంది. జనాభా వృద్ధి.. ఆర్థిక, సామాజిక, ప్రజల జీవన నాణ్యత

మెరుగుదలకు అవసరమైన వనరుల లభ్యతపై ప్రతికూల ప్రభావాన్ని చూపింది. అదేవిధంగా అధిక జనాభావృద్ధి... తలసరి ఇంధన వినియోగం పెరుగుదలకు దారితీసి, పర్యావరణ క్షీణతకు కారణమైంది. జనాభా పెరుగుదలను అరికట్టపోతే.. కాలుష్య సమస్యలు, తద్వారా ఆరోగ్య సమస్యలు తలెత్తి.. ఆర్థిక ప్రగతిలో అసమానతలకు, నిరుద్యోగం, పేదరికం పెరగడానికి దోహదపడతాయి.

మాల్థస్ (Malthus)... An Essay on the principles of population అనే గ్రంథంలో... జనాభా పెరుగుదల, ఆహార సరఫరాకు ఉన్న విలోమ సంబంధాన్ని వివరించారు. జనాభా అధిక వృద్ధి వల్ల తలసరి సాగుభూమి తగ్గుతుంది. 1921 నుంచి 2001 మధ్యకాలంలో తలసరి సాగుభూమి 1.11 ఎకరాల నుంచి 0.32 ఎకరాలకు తగ్గింది. 1961లో దేశ జనాబా 442 మిలియన్లు. కాగా ఆహార ధాన్యాల నికరలభ్యత 76 మిలియన్ల టన్నులు. అయితే తలసరి ఆహార ధాన్యాల లభ్యత 469 గ్రాములు. 2005లో జనాభా 1103 మిలియన్లు. కాగా మొత్తం ఆహార ధాన్యాల నికర లభ్యత 157 మిలియన్ టన్నులకు పెరిగింది. అయినా తలసరి ఆహార ధాన్యాల లభ్యత 422 గ్రాములకు తగ్గడం.. జనాబా అధిక వృద్ధిని తెలియ చేస్తుంది.

గ్రామీణ ప్రాంతాల్లో జనాభావృద్ధి అధికమైనందువల్ల మొత్తం ఆహార ఉత్పత్తిలో కుటుంబ వినియోగం వాటా తగ్గి, మిగులు తగ్గుతుంది. జనాభా వృద్ధి శ్రామికశక్తిలో పెరుగుదలకు దారితీసి... నిరుద్యోగం పెరగడానికి కారణమవుతోంది. గత 56 ఏళ్ల ప్రణాళికా కాలంలో... శ్రామిక శక్తిలో నికర పెరుగుదల కారణంగా తలెత్తిన నిరపేక్ష, సాపేక్ష నిరుద్యోగం పెరుగుదలను నియంత్రించడంలో విధాన నిర్ణేతలు విఫలమయ్యారు. రాబోయే రోజుల్లో ఈ స్థితి మరింత సమస్యకు దారితీస్తుంది. పెరుగుతున్న శ్రామికశక్తికి అనుగుణంగా ఉపాధిని కల్పించా లంటే... జాతీయ వనరుల్లో ఎక్కువ భాగాన్ని ఇందుకోసం కేటాయించాలి. 11వ ప్రణాళిక పత్రం ప్రకారం... నిరుద్యోగితా రేటు 2004-05లో 8.3 శాతానికి పెరిగింది.

జనాభా విధానాలు:

స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వం రూపొందించిన జనాభా విధానాలు... దేశంలో అధిక జనాభావృద్ధి నియంత్రణకు అవసరమైన అన్ని చర్యలు సూచించాయి. 1952 తర్వాత దేశ జనాభా విధానంలో... జనాభా సహజవృద్ధి తగ్గించడానికి fertility, మరణరేటు తగ్గించడానికి కుటుంబ నియంత్రణకు ప్రోత్సాహమిచ్చారు. దీని ఫలితంగా దేశ వ్యాప్తంగా fertility, మరణరేట్లు తగ్గాయి. దేశంలో ప్రస్తుతం 15 సంవత్సరాల లోపు వారు 35 శాతం మంది ఉన్నారు.

జనాభా విధానం ప్రభావం.. జననరేటు లక్ష్యాల సాధన ఆధారంగా తెలుసుకోవచ్చు. మొదటి పంచవర్ష ప్రణాళికలో... ప్రతి 1000 జనాభాకు జనన రేటు 25గా ఉండాలని... ఈ లక్ష్యాన్ని 1972 నాటికి సాధించాలని లక్ష్యంగా పెట్టుకోగా... ఈ లక్ష్యం 30 ఏళ్ల తర్వాత సాధ్యమైంది.

అదేవిధంగా 2000 జాతీయ జనాభా విధానం... replacement fertility 2010 నాటికి సాధించాలని లక్ష్యంగా పెట్టుకోగా... 2021 లోపు ఈ లక్ష్యాన్ని చేరుకునే పరిస్థితి కనిపించడంలేదు. రాష్ట్రాల వారీగా పరిశీలించినపుడు.. ఉత్తరప్రదేశ్ (ఛత్తీస్‌గఢ్‌తో కలిపి)లో ఈ లక్ష్యం 2025 తర్వాతే సాధించే అవకాశం కన్పిస్తుంది.

ఇద్దరు పిల్లల నిబంధన పాటించాలని... 2046 నాటికి జనాభా స్థిరీకరణ సాధించాలనే ఉద్దేశంతో...'జనాభా విధానం-2000'ను ప్రభుత్వం ప్రకటిం చింది. ప్రతి వేయి జననాలకు.. శిశు మరణాలు 30కి తగ్గిం చాలని .. ప్రసూతి మరణాలు ప్రతి లక్ష ప్రసవాలకు 100 లోపు ఉండాలని .. universal immunisation సాధించాలని, 80 శాతం ప్రసవాలు శిక్షణ పొందిన స్టాఫ్ ఉన్న డిస్పెన్సరీలు, ఆసుపత్రుల్లో జరగాలని, communicable వ్యాధులను నియంత్రించాలనే లక్ష్యాలను ఈ విధానంలో పొందుపరిచారు. ఈ లక్ష్యాల సాధనకు సంబంధించి దేశ ప్రగతి అంత సంతృప్తికరంగా లేదు.

జాతీయ జనాభా విధాన లక్ష్యాలకు సంబంధించి రాష్ట్రాల ప్రగతిని కొలవడానికి 8 సూచికలను రూపొందించారు. వీటిలో నాలుగు ప్రభావిత సూచికలు (Impact indicators). మిగిలిన నాలుగు programme indicators. ప్రభావిత సూచికలుగా... మొత్తం సంతాన సాఫల్యరేటు, శిశుమరణాల రేటు, ప్రసూతి మరణాల రేటు, 18 సంవత్సరాలలోపు వివాహమైన స్త్రీల నిష్పత్తి తీసుకోగా... ప్రోగ్రామ్ సూచికలుగా... contraceptionకు ఉన్న డిమాండ్, Immunised children నిష్పత్తి, సురక్షిత డెలివరీల నిష్పత్తి, జననా(రిజిస్ట్రెషన్)ల నమోదు పూర్తి వంటి అంశాలను తీసుకొన్నారు!!